## క్లుప్తంగా

### పులివెందులలో ప్రజాస్వామ్యం అపహాస్యం


స్టాలిన్‌బాబు

యలమంచిలి: పులివెందులలో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి నాయకులు పోలింగ్ బూత్‌లలోనికి ఏజెంట్‌లను, ఓటర్లను వెళ్లనివ్వకుండా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని స్టాలిన్ ఆరోపించారు. అప్రజాస్వామ్యంగా ఓటింగ్ జరిగిందని, ఓటర్లను భయపెట్టి, ఏజెంట్‌లను కొట్టి రిగ్గింగ్ చేస్తున్న పోలీసులు, ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని పేర్కొన్నారు. రిగ్గింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలలో రీ పోలింగ్ నిర్వహించాలని స్టాలిన్ బాబు డిమాండ్ చేశారు.

### ఒంటరి మహిళకు ఆర్థిక సాయం

యలమంచిలి: జై భీమ్ యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏనుగువానిలంక గ్రామానికి చెందిన ముచ్చర్ల సూర్యకుమారికి రూ. 11 వేలు అందించారు. సూర్యకుమారి భర్త అనారోగ్యంతో ఇటీవల మరణించారు. సూర్యకుమారి ఆరోగ్యం పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు ఈ సహకారం అందించారు.

### ఘనంగా ఎస్‌టీఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం


ఎస్‌టీఎఫ్‌ఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

యలమంచిలి: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మేడపాడు సెంటర్లో ఉన్న యూటీఎఫ్ స్థూపం వద్ద ఎస్‌టీఎఫ్‌ఐ పతాకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి సరిపల్లి జయప్రభ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయిలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ చొరవతో 2000వ సంవత్సరంలో ఎస్‌టీఎఫ్‌ఐ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి, మండల శాఖ ఇన్‌చార్జి పోలిశెట్టి క్రాంతికుమార్, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు వి.జగ్గారావు, సహాధ్యక్షులు కుడుపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలి

పెనుగొండ: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామ కార్యదర్శులు, ఇతర సిబ్బంది శ్రద్ధ వహించాలని ఆచంట ఎంపీడీవో బి కృష్ణ మోహన్ సూచించారు. మంగళ వారం ఆచంట ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించిన పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏఓ బాబ్జీ, డిప్యూటీ ఎంపీడీఓ బులి సూరన్న పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు

- కొనేసి ఖాళీగా వదిలేస్తున్న వైనం
- అపారిశుద్ధ్యంతో ప్రజల ఇక్కట్లు
- మున్సిపల్ రిజర్వు స్థలాలదీ అదే స్థితి


ముచ్చర్లవారి లేఅవుట్‌లో ఖాళీ స్థలాల్లో మొక్కలు, నిల్వ ఉన్న వర్షపు నీరు


సూర్యతేజన్ నగర్ నుంచి వరిదనం వెళ్లే రోడ్డులో మునిసిపల్ రిజర్వ్ స్థలం ఇలా


భార్గవి నగర్‌లో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన మొక్కలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ప్రైవేటు, మునిసిపల్ రిజర్వ్ స్థలాలు అనారోగ్యానికి నిలయాలుగా మారుతున్నాయి. ఆయా స్థలాలను ఖాళీగా ఉంచడంతో అధ్వాన్నంగా మారి చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పట్టణంలో ఉన్న 31 వార్డుల్లో సుమారు 75 వేల మంది జనాభా ఉన్నారు. కొందరు ఇళ్లను నిర్మించుకోవాలని స్థలాలు కొనుగోలు చేసుకోగా.. మరికొందరు తమ వారసులకు స్థిరాస్తులుగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో కొనుగోలు చేసినవారు ఉన్నారు. అయితే ఆయా స్థలాలను ఖాళీగా ఉంచడంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వాటిలో చెత్త, చెదారం, మొక్కలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా వర్షం నీరు నిల్వ ఉండిపోవడం వల్ల పరిసర ప్రాంతవాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. అలాగే పక్క భవనంలో నివాసం ఉండే స్థానికులు చెత్తను ఆ ఖాళీ స్థలంలో వేయడంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. దానితో పందులు, కుక్కలు, దోమలు స్వైర విహారంతో పాటు రోకలిబండలు, గొంగళిపురుగులు, విష సర్పాలు, చిన్న చిన్న పురుగులు ఇళ్లల్లోకి వచ్చి చేరుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో పట్టణంలో 10,11, 16 వార్డుల్లో ప్రజలు అనారోగ్యాలకు గురైన సంఘటనలు జరిగాయి. దీనికి ప్రధాన కారణం ఖాళీగా ఉన్న స్థలాలేనని నాడు అధికారులు గుర్తించారు. కొందరు స్థల యజమానులు దూరప్రాంతాల్లో ఉండడం వల్ల అధికారులకు వాటిని గుర్తించడం కష్టమవుతుంది. ఇలాంటి స్థలాలు పట్టణంలో సుమారు వందల సంఖ్యలో ఉండవచ్చని మునిసిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు.

**మునిసిపల్ రిజర్వ్ స్థలాలు అధ్వానం**

ప్రజల స్థలాలు అలా ఉంచితే మునిసిపల్ రిజర్వ్ స్థలాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. లే అవుట్లలో ఉన్న రిజర్వ్ స్థలాల్లో మురుగునీరు చేరి మొక్కలు పెరిగిపోయి అత్యంత దారుణంగా ఉన్నాయి. రిజర్వ్ స్థలాలు పట్టణంలో దాదాపుగా 140కి పైనే ఉన్నాయి. వీటికి చుట్టూ ఫెన్సింగ్ వేసి, స్థలాన్ని చదును చేసి శుభ్రం చేయాల్సి ఉంది. గతంలో కొన్ని రిజర్వ్ స్థలాలకు ఫెన్సింగ్ వేశారు. అదికూడా అసంపూర్తిగానే వేశారు. కొందరు రాత్రి సమయాల్లో ఈ రిజర్వ్ స్థలాల్లో చెత్తను తీసుకువచ్చి పడేస్తున్నారు. వీటి వల్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతుంది. అధికారులు పట్టించుకుని రిజర్వు స్థలాలు శుభ్రం చేయాలని అలాగే ఖాళీ స్థలాల్లో మునిసిపల్ బోర్డులు ఏర్పాటు చేసి సంబంధిత యజమానులచే శుభ్రం చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**యజమానుల్లో నిర్లక్ష్యం**

పట్టణంలో ఓ సరిహద్దుదారుని ఇంటి పక్కన ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలం యజమానికి ఫోన్ చేసి వర్షాకాలం కదా ఒక్కసారి స్థలం శుభ్రం చేయించండని కోరాడు. నేను చేయించను ఫిర్యాదు చేసుకుంటావా చేసుకో? ఏం చేస్తారు. మునిసిపాలిటీ అధికారులు నోటీసు ఇస్తారు.. కోర్టుకు వెళ్లి ఫైన్ కడతాను అని చెప్పడంతో ఆ సరిహద్దుదారుడు కంగు తిన్నాడు. కొన్ని చోట్ల మునిసిపల్ అధికారులు హెచ్చరికలు, నోటీసులతో స్థల యజమానులు తమ స్థలాలను శుభ్రం చేస్తున్నారు. కొన్ని కొన్ని చోట్ల పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. దానివల్ల ఖాళీస్థలాల్లో వర్షం నీరు నిల్వఉండిపోతున్నాయి. అవి పసర్లుగా మారడంతో చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు.

**యజమానులు పట్టించుకోవడం లేదు**



నా ఇంటి పరిసరాల్లో ఖాళీ స్థలం ఉంది. ఆ యజమానితో మాట్లాడితే నేను శుభ్రం చేయించను నీకు చేతనైనది చేసుకో అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడు. మా ఇంటి సరిహద్దు ప్రాంతంలో ఇళ్లు, ఆసుపత్రి కూడా ఉన్నాయి. చెత్త పెరిగిపోయి చాలా దుర్వాసనవస్తుంది. స్థలాలను శుభ్రం చేయాలని చెబుతుంటే వాగ్వివాదానికి వస్తున్నారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను తొలగించేవిధంగా మునిసిపల్ అధికారులే తగిన చర్యలు తీసుకోవాలి. – నడింపల్లి సూరప్‌రాజు, అధ్యాపకుడు, పాలకొల్లు

**నీరు నిల్వ ఉండిపోతుంది**



వర్షాలు కురిస్తే చాలు ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోతుంది. వేసవి కాలం వస్తేనే తప్ప ఈ నీరు ఇంకే పరిస్థితి కనిపించడంలేదు. ఈ నీటిని బయటకు మళ్లించడానికి కూడా ఆస్కారం ఉండడం లేదు. దానికి తోడు స్థానికులు చెత్తను కూడా అందులోనే వేస్తున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నాము. అధికారులు కనీసం ఇటువంటి ప్రాంతాల్లో ముగ్గు, దోమల మందులు పిచికారి చేస్తే బాగుంటుంది. – శిరిగినీడి సూర్యారావు, ఫర్నీచర్ షాపు, పాలకొల్లు

**స్థలాలు కోల్పోవాల్సి వస్తుంది**



ఖాళీ స్థలాల పక్కన ఉన్న స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు. స్థల యజమానులను శుభ్రం చేయమని అంటుంటే వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోతున్నారు. అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. ఇలా అధ్వానంగా ఉంటున్న ఖాళీ స్థల యజమానులకు గతంలోను నోటీసులు ఇచ్చాం. అయినా స్పందించకపోతే మరో సారి నోటీసులు ఇస్తాం. స్పందించని యజమానుల స్థలాల్లో మునిసిపాలిటీ అధికారులే శుభ్రం చేయించి ఆ స్థలాల్లో మునిసిపల్ స్థలాలుగా బోర్డులు ఏర్పాటు చేస్తాం. – బి.విజయసారథి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

### నమస్తే పథకంపై అవగాహన


పథకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసాపురం: వీధుల్లో చెత్త వస్తువులు సేకరిస్తూ జీవనం సాగిస్తున్న వారిని గుర్తించి వారికి మెరుగైన జీవన విధానం కల్పించడమే నమస్తే పథకం ముఖ్య లక్ష్యమని రిసోర్స్ ఆర్గనైజర్ టి.పావని అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎం.అంజయ్య అధ్యక్షతన నమస్తే పథకంపై సచివాలయాల శానిటరీ సెక్రటరీలకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చెత్త, వ్యర్థాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న వారిని గుర్తించి వారికి వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, పీపీఈ కిట్లు, సామాజిక భద్రత ప్రయోజనాలు కల్పించేలా శిక్షణ అందిస్తామని చెప్పారు. ఇలాంటి వారిని శానిటరీ సెక్రటరీలు గుర్తించాలని సూచించారు.

### నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం: స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పది పదవులకు ఎన్నిక ఏకగ్రీవమైందని ఆయన వెల్లడించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శితో పాటు నాలుగు కార్యవర్గ సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శి పదవికి విన్నా సూర్యప్రకాశ్ రావు, రొక్కాల గ్లాడ్ స్టన్ కుమార్, కార్యవర్గ సభ్యుల పదవులకు కొప్పర్తి వెంకట కృష్ణమూర్తి, పులపర్తి హర్షవర్ధన్, గోరింకల వినోద్ కుమార్, కొల్లాటి ఆదినారాయణ, కంభాల స్వర్ణ పోటీ పడుతున్నారని జోసెఫ్ తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ తరువాత ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు.

# కూటమిది మోసపూరిత గెలుపు

మాజీ మంత్రి శ్రీ రంగనాథరాజు


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు

పెనుమంత్ర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి అరాచక పాలన చేస్తుందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు అన్నారు. పెనుమంత్ర మండల వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ముఖ్య సమావేశం మంగళవారం సాయంత్రం తూర్పు పాలెంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో మండల అధ్యక్షుడు గూడూరు దేవేంద్రుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీ రంగనాథరాజు మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మరిచి ప్రశ్నించిన వారిపై అక్రమ పోలీసు కేసులు పెట్టి వేధించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. గ్రామస్థాయిలో కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలను కోరారు.

**భయపడాల్సిన అవసరం లేదు**

కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గారి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ఎప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ సమావేశ ఏర్పాటు చేసి సీనియర్ నాయకులను చురుగ్గా పని చేసే కార్యకర్తల అనుబంధం కమిటీలో సభ్యులుగా నియమించుకుని ఆయా గ్రామాలనుంచి నివేదిక పంపాలని అనుబంధ కమిటీల నాయకులను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి రామలింగేశ్వర రెడ్డి, జిల్లా యువజన విభాగం నాయకులు చెరుకువాడ నరేష్ రాజు, మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్ మండల బీసీ సెల్ అధ్యక్షులు దొంగ దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రా రవికుమార్, మండల సర్పంచ్ అధ్యక్షులు తవనంపూడి వీరెడ్డి, బహుజన కులాల రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, గుడిమెట్ల లక్ష్మారెడ్డి, పి.నరసింహమూర్తి, మాంద్రు శాంతా వెంకటేష్, గద్దం ఈశ్వరుడు, మాజీ సర్పంచ్ కొవ్వూరు విజయ్ శ్రీ వెంకటేశ్వర రెడ్డి, అల్లం భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచులు భూపతిరావు శ్రీనివాసరాజు, కర్రి వేణు బాబు, ఉప సర్పంచ్ కొవ్వూరి సుబ్బిరెడ్డి, పెనుమత్స విశ్వనాథరాజు, కొవ్వూరు వేణుమాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్విజ్ పోటీలు


క్లబ్ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల ఇంగ్లిష్ క్లబ్ ఆంగ్ల విభాగం, టేలర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఇంగ్లిష్ క్లబ్ సమన్వయకర్త, కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనర్ ఎం. సారంగపాణి మాట్లాడుతూ ఈ పోటీలు పట్టణ స్థాయిలో వివిధ కళాశాలల మధ్య గత కొన్ని రోజులుగా నిర్వహిస్తూ ఫైనల్ పోటీలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులమధ్య ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించి, వారిమధ్య కళాశాలల మధ్య మంచి వాతావరణం పెంపొందేలా చేయడమే క్లబ్ ముఖ్యలక్ష్యమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ్ సతీష్ మాట్లాడుతూ పోటీ తత్వాన్ని విజ్ఞానాన్ని పెంపొందించేలా క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంగ్లీషు క్లబ్‌ను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డీన్ ప్రొఫెసర్ గంధం శ్రీ రామకృష్ణ, మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ రంగినీడి పార్థసారథి, హెచ్ఆర్డీ సెంటర్ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పాలకొల్లు సెంట్రల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని ఎంత ఉపయోగించుకుంటే అంత మేధస్సు పెరుగుతుందని ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ కంటెంట్‌ను ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథాలయం ఎలా ఆవిర్భవించింది? దాని వల్ల కలిగే ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ కె భద్రాచలం, అధ్యాపకులు బి వెంకటస్వామి, లైబ్రేరియన్ వివిసిహెచ్ రమేష్, కె దశరధ్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు**

79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కళాశాలలో విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు, దేశభక్తి గీతాలు, సాంప్రదాయ, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఆగష్టు 15న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ టి కృష్ణ తెలిపారు.

# నులిపురుగుల నివారణపై అవగాహన


అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న నోడల్ అధికారి భార్గవి

పాలకొల్లుసెంట్రల్: తినే ఆహారం చాలా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తినే పండ్లు శుభ్రమైన నీటితో కడిగి తినాలన్నారు. కాయగూరలను సైతం శుభ్రం చేసుకున్న తరువాతనే వాడుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగు నిర్మూలన మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ ఉపాధ్యాయులు జి వెంకటేశ్వర్లు, మధు, నందిని , లీలాకుమారి పాల్గొన్నారు.

**లంకలకోడేరులో**

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అరట్లకట్ట గ్రామంలో నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నోడల్ అధికారి భార్గవి ముఖ్య అతిథిగా పాల్గొని లంకలకోడేరు జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. మాత్రల పంపిణీను 97 శాతం పూర్తి చేసినట్లు భార్గవి తెలిపారు. డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, హెచ్‌ఎం జి.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తిరంగా యాత్ర

పెనుగొండ: ఆజాదీ అమృత్ మహోత్సవాలు సందర్భంగా వడలిలో తిరంగా యాత్ర నిర్వహించారు. వడలిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర చేశారు. అలాగే ఆచంట కచేరీ సెంటర్ నుంచి వల్లూరు వరకూ బీజేపీ నాయకులు మూడు రంగుల జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నేదునూరి శ్రీనుబాబు, ముచ్చర్ల నాగ సుబ్బారావు, కన్వీనరు పనస పండు పాల్గొన్నారు.

**పెనుమంత్రలో..**

పెనుమంత్ర: మండల బీజేపీ ఆధ్వర్యంలో పాలమూరు నుంచి మార్టేరు వరకు మంగళవారం జాతీయ జెండాలతో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు గోపరాజు మారుతి కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 10 కిలోమీటర్లు నిర్వహించిన ఈ ర్యాలీలో మండలంలోని బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**పాలకొల్లులో..**

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో మంగళవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొల్లి కొండ ప్రసాద్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నుంచి యడ్లబజారు, వరకూ తిరంగ యాత్ర అత్యంత వైభవంగా కొనసాగించారు. స్థానిక ఎఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థులు వంద మీటర్ల జాతీయ జెండాతో ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి పద్మారావు, కెవి కృష్ణ వర్మ, జక్కంపూడి కుమార్, కబర్ది, మల్లవోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్య సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలి


స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో అతిథులను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వి చక్రవర్తి అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు సైకాలజీ పై డాక్టర్ చక్రవర్తి అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ కేవీసత్యనారాయణ, కోశాధికారి కె.త్రినాధస్వామి, కళాశాల డైరెక్టర్ ఏ.శ్రీహరి, ప్రిన్సిపాల్ డా ఎస్. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

### వ్యవసాయ శాఖ ఏడీగా ప్రసాద్



నరసాపురం రూరల్: నరసాపురం సహాయ వ్యవసాయ సంచాలకులుగా పీవీవీఎస్ఎస్‌పీ ప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏడీఏ గా పనిచేసిన ఈదా అనిల కుమారి ఏలూరు ఏడీఏగా బదిలీ కావడంతో ఆ పోస్టులో ప్రసాద్ చేరారు. ఈయన ఇప్పటివరకు నిడదవోలులోని బయోలాజికల్ కంట్రోల్ లేబరేటరీలో పని చేస్తూ బదిలీపై నరసాపురం వచ్చారు.

### పిచ్చికుక్క స్వైరవిహారం


పిచ్చికుక్క దాడిలో మహిళ చేతికి గాయమైన దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: లంకలకోడేరు గ్రామంలో మంగళవారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో ఆరుగురు గాయపడ్డా రు. గ్రామంలో రాజీవ్ కాలనీలో ఇద్దరు మహిళలు ఇంటి వద్ద తమ పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా పిచ్చికుక్క వారిపై దాడి చేసింది. అక్కడ నుంచి పక్కనే ఉన్న కోడిదుంప వీధిలో మరో నలుగురు వ్యక్తులను గాయపరిచి కుక్క పారిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి తీవ్రంగా గాయాలైన ఇద్దరు మహిళలను పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మిగిలిన నలుగురికి లంకలకోడేరు పీహెచ్‌సి సెంటర్ నందు చికిత్స చేశారు.

### వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

పాలకొల్లుసెంట్రల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎంతో ఆనందం ఉంటుందని కాస్మో కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. మంగళవారం పట్టణంలో వసుధ ఫౌండేషన్ అందించిన ఆర్థిక సహాయాన్ని అనారోగ్య బాధితులకు అందించారు. ఈ సందర్భంగా గాంధీభగవాన్‌రాజు మాట్లాడుతూ ఆరుగురు నిరుపేదలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ. 70 వేలు ఆర్థిక సహాయం అందించారన్నారు. ఆయన స్ఫూర్తితో కాస్మో కాంప్లెక్స్ తరుపున మరో రూ. 20 వేలు అందించారన్నారు. కార్యక్రమంలో చేకూరి సూరిబాబు, బుద్ధరాజు, చెరుకూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.